సాక్షి ఏలూరు

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



బంగారం అధరహో

బంగారం ధరలు అదరహో అనిపిస్తున్నాయి. పెట్టుబడి పెట్టినవారికి శుభ పరిమాణం కాగా సామాన్యుడికి మాత్రం ఆర్థిక భారంగా మారుతుంది. 8లో ▸



‘పట్టిసం’లో ఏర్పాట్లపై సమీక్ష

పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా పోలీసులు పనిచేయాలని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. 8లో ▸



చికెన్ షాపులు వెలవెల

బర్డ్‌ఫ్లూ కలకలంతో చికెన్ తినేందుకు ప్రజలు హడలిపోతున్నారు. చాలా చోట్ల చికెన్ షాపులు మూతబడ్డాయి. తెరచినా కొనేవారు లేక వెలవెలబోతున్నాయి. 8లో ▸

సర్వేలతో సతమతం

- సంక్షేమ ఫలాలు తొలగించేందుకు సర్కారు కుట్రలు
- సచివాలయ సిబ్బందిపై పని ఒత్తిడి
- 8 రకాల సర్వేలు చేయిస్తున్న ప్రభుత్వం
- పథకాలు అందకుండా చేసేందుకే అంటున్న ప్రజలు



చాట్రాయిలో చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారాలపై సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ఏలూరు(మెట్రో): ప్రజల ఆశలను వమ్ముచేసి వారికిచ్చే ఆసరాను కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోంది. అధికారంలోకి రావడానికి ముందు అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ బీరాలు పలికి, వచ్చాక నేటికీ ఒక్కటీ చేయలేదు. సర్వేల పేరుతో మాయ చేయడంతో పాటు, ఆ సర్వేల మాటున ఉన్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు దూరం చేసే కుట్ర చేస్తోంది. ప్రజలను మోసం చేసే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన సర్వేల ప్రక్రియ అధికారులకు ఇబ్బందిగా తయారైంది. సర్వేల వల్ల ఉపయోగమేమిటో ప్రజలకు వివరించలేక, వారు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సచివాలయ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సతమతమవుతున్న ఉద్యోగులు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్వేలు సచివాలయ ఉద్యోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. **జిల్లా** వ్యాప్తంగా హౌస్‌హోల్డ్, ప్యాక్స్ ఈకేవైసీ, **మిస్సింగ్** సిటిజన్, జియో ట్యాగింగ్, గ్రామ **పంచాయతీ** ఆస్తుల వివరాలు, ఎన్‌పీసీఐ మ్యాపింగ్, **పింఛన్** లబ్ధిదారుల పరిశీలన, క్యాన్సర్ సర్వే, **18 సంవత్సరా**లు నిండిన వారి వివరాలు, హౌసింగ్ **డిమాండ్** సర్వే, ఎంఎస్‌ఎంఈ, నాన్ రెసిడెంట్ **ఏపీ సిటిజన్** తదితర సర్వేలు సచివాలయ ఉద్యోగులు **నిర్వహిస్తున్నారు.** సరైన ప్రామాణికత లేని **ఈ సర్వేలు** నిర్వహించడం సచివాలయ ఉద్యోగులకు కత్తిమీద సాములా మారింది. జిల్లాలోని గ్రామాల్లో సర్వేల కోసం వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు ప్రజల నుంచి చేదు అనుభవం ఎదురవుతుంది. సర్వేలకు ఓటీపీలు చెప్పేది లేదంటూ ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు.

ప్రదక్షిణలు మొదలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ప్రదక్షిణలు మొదలయ్యాయి. గత ప్రభుత్వం ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా వలంటీర్ వ్యవస్థ ద్వారా సేవలు అందించారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పాలనను చేరువ చేయడంతో పాటు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటికే చేర్చారు. నేటి కూటమి ప్రభుత్వంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏ పని కావాలన్నా కార్యాలయాలు, నాయకులు, అధికారులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలు నిత్యం సంక్షేమ పథకాల లబ్ధి కోసం కలెక్టరేట్, ఎంపీడీవో, తహసీల్దార్, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసి విసిగి వేసారి పోతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 547 గ్రామపంచాయతీలు ఉండగా, 664 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 605 సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు. జిల్లాలో 28 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్లు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలుగా జిల్లా విస్తరించి ఉంది. జిల్లా వ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం 20,06,684 మంది ఉన్నారు. 5,591 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

నాడు సంక్షేమంతో సుభిక్షం

గత వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెల్లివిరియగా, ప్రతి ఇంట సంతోషం వెల్లివిరిసింది. క్యాలెండర్ ఇయర్‌ను ప్రకటించి ప్రతీ నెలా ఏదో ఒక సంక్షేమాన్ని అమలు చేస్తూ ఏడాది పొడవునా నాటి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. దీంతో ప్రతీ కుటుంబానికి కనీసం మూడు నాలుగు సంక్షేమ పథకాలు అందడం ద్వారా వారికి అదనపు ఆదాయం సమకూరింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా జీవనం సాగేది. సొంతంగా కాళ్ల మీద నిలబడాలనుకునే వారికి పెట్టుబడి సాయంగా, రైతులకు అండగా, మహిళలకు ఆసరాగా, విద్యార్థులకు ఆలంబనగా ప్రతీ పథకం నిలిచింది.

సూపర్ సిక్స్ ఏది?

నేటి కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం కరువైంది. అధికారం చేపట్టిన నాటి నుంచి గత ప్రభుత్వం అంటూ విమర్శలు చేస్తున్నారే తప్ప నాటి ప్రభుత్వం అవలంభించిన సంక్షేమ కార్యక్రమాల ఊసెత్తడం లేదు. అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చిన చంద్రబాబు, కూటమి నాయకులు ఆచరణలో బేల చూపులు చూస్తున్నారు. సూపర్ సిక్స్ అమలు చేయలేని నిస్సహాయతను కప్పిపుచ్చుకునేందుకు సర్వేలకు ప్రాధాన్యమిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పేద కుటుంబాలకు సర్వే వల్ల ఎలాంటి లాభం లేదు.



వదంతులు నమ్మొద్దు

శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల ఖననం

భీమవరం (ప్రకాశంచౌక్): చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేస్తున్నామని, ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననాన్ని పశు వైద్యులు, సహాయక సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వేల్పూరుకు కిలోమీటర్ దూరంలోని ప్రాంతం అలర్ట్ జోన్‌గా ప్రకటించి అప్రమత్తం చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, అటవీ, పశు సంవర్ధక తదితర శాఖలతో 20 ర్యాపిడ్‌రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ గ్రామాలకు చుట్టుపక్కల 10 కిలోమీటర్ల ప్రాంతంలో కోళ్ల, కోళ్ళ ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేశామన్నారు. కొల్లేరు పరివాహక ప్రాంతంలో ఈ వ్యాధి ప్రబలకుండా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. అలర్ట్ జోన్ ప్రాంతంలో మినహా, మిగిలిన ప్రాంతాలలో ఉడకబెట్టిన గుడ్లు, మాంసాన్ని నిర్భయంగా వినియోగించవచ్చని స్పష్టం చేశారు. రెడ్ జోన్‌లో 2 చెక్‌పోస్టులు, ఆరెంజ్ జోన్‌లో 4 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

638 సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన వాటిని రికవరీ చేసి బాధితులకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ విలువైన సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందజేయడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను భారీ ఎత్తున రికవరీ చేశారు. 14వ దఫాలో భారీగా 638 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల విలువ సుమారుగా రూ.76.56 లక్షలు ఉంటుందని అంచనా. పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, విశాఖపట్నం, తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాలతోపాటు తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు సైతం పోలీసులు వెళ్ళి సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఐదేళ్ళ కాలంలో సుమారుగా 2,398 సెల్‌ఫోన్లు రికవరీ చేయగా.. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.4.06 కోట్లపైనే ఉంటుందని అంచనా. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చోరీ కేసుల్లోని వస్తువులు కొనుగోలు చేసినా.. విక్రయించినా కఠినమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతోన్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సెల్‌ఫోను చోరీ చేసే నేరగాళ్ళు ప్రధానంగా మీ అటెన్షన్ డైవర్ట్ చేస్తూ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, రైతు బజార్లు, రద్దీ ప్రదేశాల్లో చోరీలు చేస్తారని చెప్పారు. సెల్‌ఫోన్ రికవరీలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ సీహెచ్ రాజశేఖర్, వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల భిక్షాటన



కార్పొరేషన్ బయట భిక్షాటన చేస్తున్న డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో 60 మంది చెత్త వాహనాల(క్లాప్)డ్రైవర్లను ఫిబ్రవరి 1న అక్రమంగా విధుల నుంచి తొలగించారని, తిరిగి పనిలోకి తీసుకోవాలని, మూడు నెలల బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ గత 12 రోజులుగా క్లాప్ వాహనాల డ్రైవర్లు ఆందోళనలు చేస్తున్నారు. బుధవారం డ్రైవర్లు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి మెయిన్ బజార్ ఏరియాలో భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. భిక్షాటన కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు లేక పస్తులతో అలమటిస్తున్నారని తెలిపారు. క్లాప్ ఆటోల డ్రైవర్లకు ఇవ్వాల్సిన మూడు నెలల బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని, డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నారసింహునికి చందనోత్సవం



ఉగ్రనారసింహుడికి హారతులిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు ఈశ్వర్‌కుమార్ శర్మ

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి చందనోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకతో ఉగ్ర రూపంలో ఉన్న నారసింహుడు చందనలేపంతో సేదతీరారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం నాడు ప్రారంభమైన స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున ఆలయంలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత స్వామి మూలవిరాట్‌కు చందన మహోత్సవాన్ని వేద మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. ఉగ్ర రూపంలో ఉండే లక్ష్మీనారసింహుడిని శాంతింపజేసే క్రమంలో జరిగిన ఈ ఉత్సవాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు. పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, నీరు, తేనెతో ముందుగా స్వామిని అభిషేకించారు. మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, అవబృదం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. పెద్ద ఎత్తున మహిళా భక్తులు సుందరగిరిపై పాలపొంగళ్లను వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

పోలింగ్ విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



పీవో, ఏపీవోల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను బాధ్యతగా స్వీకరించి నిష్పక్షపాతంగా పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి పోలింగ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలపై పీఓలు, ఏపీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వెట్రిసెల్వి, ఎన్నికల పరిశీలకురాలు కె. సునీత, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 3,14,984 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారని తెలిపారు. పోలింగ్ ముందురోజు ఏలూరులో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని అందజేస్తామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామగ్రితో సహా ఏలూరులో ఉన్న స్ట్రాంగ్ రూంకి జాగ్రత్తగా చేర్చాలన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన మొదటి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఆమె పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

ఏలూరు(మెట్రో): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా నేడు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం జరగనుంది. ఇంతవరకు 54 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా, 11 మంది నామినేషన్లు తిరస్కరించారు. గురువారం సాయంత్రం తుది జాబితా అందనుంది. 27 న పోలింగ్ నిర్వహించనుండగా, మొత్తం 3,14,984 అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించనున్నారు.

చింతమనేని వేధింపులు తాళలేక నామినేషన్

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం శ్రీపర్రు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రేవులగడ్డ ముకేష్ బాబు పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. ఈ నెల 10న నామినేషన్ పత్రాలు అందించారు. దెందులూరు నియోజకవర్గంలో నాయకుల వేధింపులకు గురవుతున్న ఎందరో టీడీపీ కార్యకర్తలు తన విజయానికి సహకారం అందిస్తారన్నారు. తన తండ్రి గోవర్ధన్‌తో కలిసి గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేశానని గుర్తు చేసారు. అయినప్పటికీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కొందరు నాయకులు తమ కుటుంబాన్ని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఇదేం ఖర్మ!

కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి గండి పడుతోంది. ఇప్పటికే అనేక పథకాలు నిర్వీర్యం చేయగా, పింఛన్లకు కత్తెర వేస్తూ వారికి కన్నీటిని మిగులుస్తున్నారు. ఇప్పటికే చాలా మంది అర్హులు పింఛన్లు కోల్పోగా, మరికొందరు పింఛన్‌లు కోల్పోయే పరిస్థితిని తీసుకువస్తున్నారు. పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తులకు స్థానికంగా సదరం సర్టిఫికెట్ ఇస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఏలూరు జీజీహెచ్ ఏర్పాటు చేసిన సదరం క్యాంప్ ఇందుకు విరుద్ధంగా తయారైంది. ఇక్కడ పరీక్షించి సర్టిఫికెట్‌లు మంజూరు చేయాల్సింది పోయి, విజయవాడ రిఫర్ చేస్తున్నారు. దీంతో లేవలేని, సరిగా నడవలేని వ్యాధిగ్రస్తులు వేరొకరి సాయంతో కష్టపడి ఆసుపత్రికి వస్తే వేరే చోటకు రిఫర్ చేయడం పట్ల అసహనం వ్యక్తంచేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



వైద్య పరీక్షలకు బారులు తీరిన పింఛనుదారులు



నిలబడలేక నేలపై కూర్చున్న పింఛనుదారులు



కూతురిని సదరం క్యాంపునకు తీసుకువస్తున్న తండ్రి



న్యూస్‌రీల్

ట్రిపుల్ ఐటీలో మెస్, ఫుడ్‌కోర్టు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ్‌భరత్ గుప్తా

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీని బుధవారం కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ్ భరత్ గుప్తా సందర్శించారు. దీనిలో భాగంగా క్యాంపస్‌లోని విద్యార్థులకు భోజనాలు పెట్టే డైనింగ్‌హాల్స్, కిచెన్, స్టోర్ రూమ్ పరిశీలించారు. అనంతరం ఫుడ్‌కోర్టును సందర్శించి అక్కడి స్టాక్‌రూమ్‌ను తనిఖీ చేశారు. ఫుడ్‌కోర్టులో ఆహార పదార్థాలు, ధరలు, నాణ్యత, లభించే పరిమాణం తదితర విషయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి అకడమిక్ బ్లాకుల్లోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సంభాషించారు. వారి విద్యకు సంబంధించిన వివరాలను, ఆహారం, వసతి, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ క్యాంపస్‌లో చేపట్టిన చర్యల గురించి వివరించారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 5,441 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రయోగ పరీక్షలకు బుధవారం 5,441 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 55 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 5,635 మందికి 5441 మంది హాజరయ్యారు. 194 మంది గైర్హాజరయ్యారు. వీరిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 3107 మందికి 2972 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 2528 మందికి గాను 2469 మంది హాజరయ్యారు.

కొల్లేటికోట హుండీ ఆదాయం రూ.9,93,961



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద హుండీల లెక్కింపు

కై కలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ హుండీల ఆదాయం రూ.9,93,961గా లెక్కించామని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ బుధవారం చెప్పారు. 113 రోజులకు భక్తులు కానుకల రూపంలో హుండీలో వేశారన్నారు.

ఇంటింటా న్యాయ సేవలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా న్యాయ సేవలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయసేవా సదన్ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 62 టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం సభ్యులు గ్రామాల్లో తిరుగుతూ బాలల సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సౌకర్యాలపై తెలియజేస్తామన్నారు.

ఉద్రిక్తతకు దారి తీసిన స్థల వివాదం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గన్‌బజార్ పెన్షన్ మహల్లా మసీద్ సమీపంలో ఓ ఇంటి స్థలం వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. పెన్షన్ మహల్లా మసీద్ కమిటీ సభ్యులు ఆ స్థలం మసీదుకు చెందుతుందని, వక్ఫ్ బోర్డు గెజిట్లో ఉందని పేర్కొంటున్నారు. ఆ ఇంట్లో ఉంటున్న వారు తాము కోర్టులో గెలిచామని ఇంజెక్షన్ ఆర్డర్ ఉందని ఇంటికి మరమ్మత్తు చేసుకుంటుండగా మసీదు కమిటీ వారు వచ్చి నిలిపివేస్తున్నారని తెలిపారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేడు కలెక్టరేట్‌లో సమావేశం

ఏలూరు(మెట్రో): తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా అభ్యర్థులకు సూచనలు చేసేందుకు 13న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తప్పక హాజరు కావాలని సహాయ రిటర్నింగ్ అధికారి కోరారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో విద్యావికాస్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: జేఈఈ మెయిన్స్‌లో విద్యావికాస్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కె.వంశీ 98.63 శాతం, జి.లిఖిత్ 95.18, జి.జ్యోతి శ్రీనివాస్ 93.47, వై.అమృత 93.04, వి.అభినవ్ 92.76, పి.హర్షిత 92.62, కె.సిరిశృతి 91.56, ఎ.మణికంఠ 90.32, పి.దేదీప్య 90.31శాతం సాధించారన్నారు. మొత్తం 120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 90 శాతం పైబడి 9 మంది, 80 శాతం పైబడి 22 మంది సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ అభినందించారు.

పోతురెడ్డిపల్లి విద్యార్థికి జాతీయస్థాయిలో పతకాలు



పతకాన్ని సాధించిన రాకిన్ చౌదరి

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లికి చెందిన 5వ తరగతి విద్యార్థి పర్వతనేని రాకిన్ చౌదరి డౌన్ సిండ్రోమ్ నేషనల్ గేమ్స్‌లో జాతీయస్థాయిలో రెండు పతకాలు సాధించాడు. కేరళలోని కొచ్చిలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో రాకిన్ చౌదరి షాట్‌పుట్ 3 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని, వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం దక్కించుకున్నాడు. రాకిన్ చౌదరిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి



పలగాని కృపారావు మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికితీసిన దృశ్యం

నూజివీడు: పశువుల కాపరి చెరువులో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరగుంటకు చెందిన పలగాని కృపారావు (49) గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో గ్రామానికి సమీపంలోని కోతుల గుంట చెరువులోకి గేదెలు దిగి నీళ్లలో పడుకొని ఎంతసేపటికి పైకి రావడం లేదు. దీంతో వాటిని పైకి తోలేందుకు కృపారావు చెరువులోకి దిగి మునిగిపోయి మృతిచెందాడు. ఇతర గేదెల కాపరులు చూసి గ్రామంలోని వారికి సమాచారం అందించారు. గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్సై ఎస్ లక్ష్మణ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడెంలో కారు దగ్ధం

తాడేపల్లిగూడెం: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావుకు చెందిన కారు మంగళవారం రాత్రి దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ జీవీరావు బుధవారం తెలిపిన వివరాలివి. పట్టణంలోని పోలీసు స్టేషన్ వెనుక, ఎండీఓ కార్యాలయం సమీపంలో పార్కు చేసిన కారు షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ షాపులు వెలవెల

- బర్డ్‌ఫ్లూ కలకలంతో దుకాణాల మూసివేత
- తెరచినా కొనేవారు లేరు
- కిరాణా షాపుల్లో గుడ్లు కొనేందుకూ ఆసక్తి చూపని కొనుగోలుదారులు



ఏలూరు చేపల తూము సెంటర్‌లో వ్యాపారాలు లేక వెలవెలబోతున్న చికెన్ షాపులు

ఏలూరు (టూటౌన్): పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో దాని ఎఫెక్ట్ ఏలూరు జిల్లాపైనా పడింది. దీంతో చికెన్, కోడిగుడ్లు తినేందుకు ప్రజలు హడలిపోతున్నారు. కొద్దిరోజులు ఈ రెండింటికి దూరంగా ఉంటే బెటర్ అనే అభిప్రాయం వినియోగదారుల్లో కన్పిస్తోంది. మరోపక్క చాలా చోట్ల చికెన్ షాపులు మూతబడ్డాయి. మరికొన్ని చోట్ల చికెన్ షాపులు తెరచినా కొనేవారు లేక వెలవెల బోతున్నాయి. దీంతో వ్యాపారస్తులు సైతం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కిరాణా షాపులు, హోల్‌సేల్ దుకాణాల్లో గుడ్లు కొనుగోలు చేసేందుకు సైతం వినియోగదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ ప్రభావం ఏలూరు జిల్లా వ్యాప్తంగాను కొద్ది రోజులు ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యాపారస్తులు వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన చికెన్ ధరలు

నిన్నటి వరకు కిలో చికెన్ ధర ఏరియాను బట్టి రూ.220 నుంచి రూ.240 ఉండేది. తాజాగా దీని ధర కిలో రూ.150కి పడిపోయింది. అయినా కొనేందుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. సాధారణంగా ఉడికించిన మాంసం, గుడ్లు తింటే ఎటువంటి వ్యాధులు రావనేది నిపుణులు చెబుతున్నారు. అయినా ప్రజల్లో ఏర్పడిన భయాందోళనల ఫలితంగా ఎక్కడికక్కడ కొనుగోళ్లు నిలిచిపోయాయని దుకాణదారులు చెబుతున్నారు.



బాలయోగి వంతెన వద్ద మూసివేసిన చికెన్ షాపు

జిల్లాలో 1.30 కోట్ల లేయర్ కోళ్లు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 200కు పైగా పౌల్ట్రీ ఫారమ్స్ ఉన్నాయి. వీటి పరిధిలో ఒక కోటి 30 లక్షల వరకు లేయర్ కోళ్లు పెంచుతున్నారు. వీటి ద్వారా ప్రతి రోజు సగటున 90 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. తాజాగా బర్డ్‌ఫ్లూ కలకలంతో పౌల్ట్రీ పరిశ్రమకు తీరని దెబ్బ తగిలినట్లేనని కోళ్ల పెంపకం దార్లు చెబుతున్నారు. అసలే పెరిగిన దాణా ఖర్చుల కారణంగా లేయర్ కోళ్ల పెంపకం భారంగా మారిందని, మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా బర్డ్‌ఫ్లూ కలకలం తమను మరింత నష్టాలపాలు చేస్తుందనే అభిప్రాయం కోళ్ల పెంపకందార్లలో వ్యక్తమవుతోంది.

బాదంపూడి పౌల్ట్రీ నుంచి పూణేకు శాంపిల్స్

ఉంగుటూరు మండలం బాదంపూడిలోని మణికంఠ పౌల్ట్రీఫారమ్ నందు కోళ్లు అధికంగా చనిపోతుండటంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం పూణేకు పంపించారు. ఒకటి రెండు రోజుల్లో రిపోర్టు వస్తుందని దానిని బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ ఫారం నుంచి ఎటువంటి ఎగుమతులు, కొనుగోళ్లు జరగకుండా ఆంక్షలు విధించారు.

20 ఆర్‌ఆర్‌టీ బృందాల ఏర్పాటు

జిల్లాలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా పశుసంవర్ధక శాఖ 20 ఆర్‌ఆర్‌టీ బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందలో పశువైద్యాధికారితో పాటు ఇద్దరు కాంపౌండర్‌లు, ఇద్దరు అసిస్టెంట్‌లు కలిపి మొత్తం ఐదుగురు సభ్యులు ఉండనున్నారు. అదే విధంగా ఒక వెయ్యి పీపీఈ కిట్స్, 500 మాస్కులు, సరిపడా స్ప్రేయింగ్ మందులు అందుబాటులో ఉంచారు. పూణే పంపించిన శాంపిల్స్ రిపోర్టు వచ్చిన తర్వాత దీనిపై కలెక్టర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. అనంతరం ప్రత్యేక వైద్య బృందాలు రంగంలోకి దిగనున్నాయి.

పరిస్థితిని సమీక్షిస్తున్నాం



ఏలూరు జిల్లాలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ కేసులు ఇంత వరకు నమోదు కాలేదు. ఉంగుటూరు మండలం బాదంపూడిలోని పౌల్ట్రీ ఫారం నందు అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో శాంపిల్స్ సేకరించి పూణే పంపించడం జరిగింది. రిపోర్టు వచ్చిన వెంటనే ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ సిద్ధంగా ఉంది.

– టి.గోవిందరాజు, జేడీ, పశుసంవర్ధక శాఖ, ఏలూరు జిల్లా

బర్డ్‌ఫ్లూ నియంత్రణకు కార్యాచరణ

ఏలూరు (మెట్రో): ఉంగుటూరు మండలం బాదంపూడిలో పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా ల్యాబ్ నిర్ధారించినందున 10 కిలోమీటర్ల పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఏవీఎన్ ఇన్‌ఫ్లూఎంజా నివారణ, నియంత్రణపై కలెక్టర్ సమీక్షించారు. పౌల్ట్రీ పరిధిలో ఒక కిలోమీటర్ రెడ్‌జోన్‌గా, పది కిలోమీటర్లు సర్వేలెన్స్ జోన్‌గా పరిగణించే అంశాలకు సమీక్షించారు. చనిపోయిన కోళ్లను గోతిలో పూడ్చేందుకు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో వలస పక్షులు వివరాలు, వాటి మరణాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని అటవీ అధికారులకు ఆదేశించారు.

బాదంపూడిలో ఇన్ఫెక్టెడ్ జోన్

ఉంగుటూరు మండలం బాదంపూడిలోని వెంకట మణికంఠ పౌల్ట్రీ ఫారమ్‌లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో ఫారం చుట్టూ కిలోమీటరు మేర ఇన్ఫెక్టెడ్ జోన్, 10 కిలోమీటర్ల వరకు సర్వేలెన్స్ జోన్లుగా ప్రకటించారు. ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో 9966779943 నంబర్‌తో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. బాదంపూడికి పది కిలోమీటర్ల పరిధిలో ప్రజలు చికెన్, కోడిగుడ్లు తినడం తగ్గించాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించారు. ఉడకబెట్టిన గుడ్లు, మాంసం హానికరం కాదన్నారు.

బధిరుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

భీమవరం : స్థానిక డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో జిల్లా స్పోర్ట్స్ పెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి బధిరుల (మూగ చెముడు) టీ20 క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ 9 జిల్లాల నుంచి 50 మంది బధిర క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మూడు డివిజన్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా క్రికెట్ కిట్ అందజేశారు. డీఎన్నార్ కళాశాల పాలకవర్గ సభ్యుడు కూనపరాజు రామకృష్ణంరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

‘పట్టిసం’లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

పోలవరం రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలు సమయంలో ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా దైవ దర్శనం చేసుకుని వచ్చే విధంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. ఆయన బుధవారం సాయంత్రం ఉత్సవ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులు గోదావరి నది దాటి వెళ్లేందుకు ఏర్పాటు చేసే పంట్లు ప్రదేశాన్ని, టిక్కెట్ కౌంట్‌లు, క్యూలైన్‌లు, ర్యాంపులు ప్రదేశాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రోడ్డుపై ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఎవరూ స్నానాలు చేయకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. పంట్లు నిర్మాణం పటిష్టంగా ఉండాలని, శివక్షేత్రం, ఇసుక తిన్నెలు, దేవస్థానం ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు కూడా పక్కాగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఏర్పాట్లు పరిశీలన అనంతరం శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు, దేవస్థానం ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరబద్రరావు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికి, పూజా కార్యక్రమాలు చేయించారు. ఈయన వెంట డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టిసం శివక్షేత్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

బాల రావమ్మా.. అనుగ్రహించమ్మా

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లో కొలువై ఉన్న దుగ్గిరాల బాల రావమ్మ తల్లి మాఘ పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం తోటపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి విశేష పూజలు, పులంగి సేవను అర్చకులు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈవో సాయి తెలిపారు. మూడు గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ధ్వజ స్తంభాల వద్ద పాలపొంగళ్లు సమర్పించారు. ఆగిరిపల్లి, కనసానపల్లి తోటపల్లిలో సంతానం కలగాలని మహిళా భక్తులు ప్రాణాచారం పట్టారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కనసానపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభ వాహనం పలువురిని ఆకర్షించింది. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై శుభ శేఖర్, సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



కనసానపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభ వాహనం, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు (ఇన్‌సెట్‌లో)

ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

- ఎస్పీ ప్రతాప్ శివకిషోర్
- డ్రైవర్లకు అవార్డుల అందజేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, తమ చేతిలో దాదాపు 60 కుటుంబాల భవిష్యత్ ఉందనే విషయాన్ని ప్రతి నిమిషం గుర్తు చేసుకోవాలని ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు విధినిర్వహణలో ప్రయాణికుల భద్రత ఒక్కటే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. దీనితో పాటు ఆర్టీసీ డ్రైవర్లు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాలు తక్కువగా జరిగాయన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు ఎస్పీ చేతుల మీదుగా అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి, నూజివీడు డిపో మేనేజర్ పవన్ కుమార్, జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్, మూడు డిపోల ఏఎంటీలు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లు వీరే..

జిల్లా స్థాయిలో నూజివీడు డిపోకు చెందిన బీ పాపారావు, ఏలూరు డిపోకు చెందిన జే చెల్లయ్య, బీకే రెడ్డి, ఏలూరు డిపో స్థాయిలో ఆర్‌వీ రావు, పీవీవీవీ రావు, డీఆర్ కృష్ణ, జంగారెడ్డిగూడెం డిపో స్థాయిలో డీవీఎస్ఎన్‌టీ రాజు, ఎం. చిన్నయ్య, ఎంబీ రావు, నూజివీడు డిపో స్థాయిలో డీవీకే రావు, బీవీ రావు, కేఆర్ కృష్ణ అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు.



ఎస్పీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్ బి.పాపారావు



జే చెల్లయ్య | బీకే రెడ్డి | ఆర్‌వీ రావు | పీవీవీవీ రావు | డీఆర్ కృష్ణ



డీవీఎస్ఎన్‌టీ రాజు | ఎం. చిన్నయ్య | ఎంబీ రావు | డీవీకే రావు | బీవీ రావు | కేఆర్ కృష్ణ

ప్రభావతి ఆగడాలపై సబ్‌కలెక్టర్ విచారణ

నూజివీడు: నూజివీడు మండలం మర్రిబంధం, సీతారామపురం గ్రామాలకు చెందిన పలువురిపై గత కొంతకాలంగా బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతున్న దావులూరి ప్రభావతిపై నూజివీడు సబ్‌కలెక్టర్ బీ స్మరణ్‌రాజ్ విచారణ చేపట్టారు. ప్రభావతి బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ అవకతవకలకు పాల్పడి సస్పెండ్‌కు గురికావడం, అనంతరం పలువురిని మోసం చేసి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదు కావడంతో నూజివీడు పోలీసులు ప్రభావతిపై రౌడీ షీట్ ఓపెన్ చేశారు. అలాగే ప్రభావతి ఆగడాలను తట్టుకోలేక గ్రామ ప్రజలు పలుమార్లు ఏలూరు కలెక్టర్‌కు మొర పెట్టుకోవడం సైతం జరిగింది. మర్రిబంధం గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్న ప్రభావతి నుంచి తమకు రక్షణ కావాలని కోరుతున్న బాధితుల గోడుపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ప్రభావతితో పాటు ఆమె కుటుంబ సభ్యులను బైండోవర్ నిమిత్తం కలెక్టర్ ఆదేశాల ప్రకారం నూజివీడు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సమన్లు జారీ చేశారు. సమన్లకు సమాధానం ఇచ్చేందుకు రెండు రోజుల సమయం కావాలని ప్రభావతి అడగంతో సబ్‌కలెక్టర్ గడువు ఇచ్చారు.

లైసెన్స్ లేని చేపల మేతల దుకాణాల సీజ్

భీమవరం అర్బన్: ఫిషరీస్ లైసెన్స్‌లు లేకుండా చేపలు, రొయ్యల మేతలు, మందులు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్ కుమార్ అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో విజిలెన్స్, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో రొయ్యలు మేతలు, మందులు విక్రయిస్తున్న షాపులపై దాడులు చేశారు. శ్రీ శివసాయి ఆక్వా ఫీడ్స్ లైసెన్స్ లేకుండా రూ.కోటి 88 లక్షల 97వేల 176 విలువ చేసే 180.925 టన్నుల చేపల మేతలు, మందులు, శ్రీ సాయి పవన్ ఆక్వా ఫీడ్స్ నందు రూ.31 లక్షల 96 వేల 237 విలువ చేసే 19.269 టన్నుల చేపలు మేతలు, మందులను సీజ్ చేశారు. ఆ షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీవో పి.లావణ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో ప్లంబింగ్ మెటీరియల్ చోరీ

తణుకు అర్బన్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి ట్యాప్‌లు, ప్లంబింగ్ మెటీరియల్ చోరీ చేసిన ఘటన తణుకులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎన్జీవో కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన గృహంలో ముఖద్వారాన్ని గడ్డపారలతో పెకలించి ధ్వంసం చేసి దొంగలు లోపలకు ప్రవేశించినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఇంట్లో టాయిలెట్స్, వంటగది, వాష్ ఏరియాల్లో ఉన్న ఖరీదైన జాగ్వార్ కంపెనీకి చెందిన ఎస్ఎస్ ట్యాప్‌లు దొంగిలించుకుపోయారు. నిర్మాణానికి సంబంధించి చివరిస్థాయి పనులు జరుగుతున్న నేపథ్యంలో దొంగలు సుమారు రూ.4 లక్షలు విలువైన టేకు ముఖద్వారాన్ని ధ్వంసం చేసి లాక్‌తోపాటు హ్యాండిల్స్, ట్యాప్‌లు దోచుకుపోయినట్లు ఇంటి యజమాని సత్య వీరమళ్ల తెలిపారు. బుధవారం ఉదయం బిల్డర్ కిరణ్ వచ్చి చూసేటప్పటికీ తలుపులు తెరిచి ఉండడం, సామాగ్రి లేకపోవడంతో యజమానికి తెలపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బంగారం అధరహో

- రోజురోజుకు బంగారం ధర పైపైకి
- 50 శాతం మేర పడిన కొనుగోళ్లు
- సురక్షిత పెట్టుబడిగా బంగారం

భీమవరం (ప్రకాశం చౌక్) : రోజురోజుకు పెరుగుతున్న బంగారం ధరలు అదరహో అనిపిస్తున్నాయి. అయితే ఇది బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి శుభపరిమాణం కాగా సామాన్యుడికి మాత్రం ఆర్థిక భారంగా మారుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి బంగారం ధర మరింత వేగంగా పెరిగి మంగళవారం నాటికి 22 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8010, 24 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8,792 చేరింది. గడిచిన మూడేళ్లలో ఏడాదికి సుమారు 10 గ్రాముల బంగారం ధర రూ 8 నుంచి 10 వేలు వరకూ పెరిగింది.

సామాన్యుడిపై ఆర్థిక భారం

బంగారం కొనుగోళ్లు పేద, మధ్యతరగతి వారికి ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా పెళ్లిళ్లలో బంగారం ప్రధాన పాత్ర వహించడంతో ఆడపిల్లల కుటుంబ సభ్యులు పెరిగిన బంగారం ధరంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు, తిరిగి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పెళ్లిళ్లు ఉన్న నేపథ్యంలో రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధర చూసి హడలిపోతున్నారు.

50 శాతానికి పడిపోయిన కొనుగోళ్లు

వేగంగా పెరుగుతున్న బంగారం ధర వల్ల బంగారం కొనుగోళ్లు 50 శాతం మేర పడిపోయాయని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో నర్సాపురం, భీమవరంలో ఎక్కువ మొత్తంలో బంగారంపై వ్యాపారం జరుగుతుంది. గతేడాది మే నెలకు ముందు రోజుకు జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లు బంగారంపై వ్యాపారం జరిగితే నేడు జిల్లా వ్యాప్తంగా కేవలం రూ.5 కోట్లు వ్యాపారా లావాదేవీలు జరుగుతున్నాయి.



భీమవరంలో ఓ బంగారం షాపులో ఇలా

గడిచిన మూడేళ్లలో ఫిబ్రవరిలో బంగారం ధరలు ఇలా

ఏడాది	22 క్యారెట్ల 10 గ్రాములు	24 క్యారెట్ల 10 గ్రాములు
2022	46,112	50,190
2023	53,750	58,380
2024	58,875	63,435
2025	81,250	88,765

కొనుగోళ్లు 50 శాతం తగ్గాయి



బంగారం కొనుగోళ్లు 50 శాతం మేర తగ్గాయి. రెండు నెలల నుంచి ధర వేగంగా పెరుతుండడంతో ఆ ప్రభావం కొనుగోళ్లపై చూపిస్తుంది. పెళ్లిళ్లు ఉన్నవారు, తప్పని పరిస్థితిల్లో కొనుగోలు చేయాల్సిన వారు మాత్రమే బంగారం కొంటున్నారు.

– కోట్ల నాగేశ్వరరావు(నాని), భీమవరం బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు

పెట్టుబడిదారులకు మంచి లాభాలు

బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి పెరుగుతున్న ధరలు మంచి లాభాలు తెస్తున్నాయి. బంగారంపై పెట్టుబడి సురక్షిత పెట్టుబడిగా ఉండడంతో సాధారణ ఉద్యోగి దగ్గర నుంచి వ్యాపారస్తులు వరకు బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. గడిచిన మూడేళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టినవారికి నేటి బంగారం ధరతో పోల్చుకుంటే రూపాయన్నర నుంచి మూడు రూపాయల వడ్డీ వచ్చింది.

పెరుగుదలకు కారణం

గత రెండేళ్లుగా బంగారం పెరుగుదలకు బుల్లియన్ వ్యాపారుల చెబుతున్న కారణాలు ఇలా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరగడం, డాలర్ విలువ రూ.84 నుంచి రూ.87 వరకు పెరగడం, ఇతర రంగాల్లో నష్టాలు రావడంతో సేఫ్టీగా భావించి బంగారం కొనుగోళ్లు పెంచడం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల బంగారం ధరలు పెరుగుతున్నాయి.